# అలేఖ్య ఆగమనం

– డా. వసంతరావు గురజాడ, Lexington, KY

ఫోను 'ట్రింగ్, ట్రింగ్' అని మ్రోగింది. నిద్రలో ఉన్న శాంత త్రుళ్ళిపడి లేచి, అతి కష్టంమీద, ఫోను దగ్గరికి వెళ్ళింది, ఆయాసపడుతూ రిసీవరు అందుకొని 'హలో' అని దీనంగా పలికింది.

అవతలి గొంతుక తన ప్రియమైన స్నేహితురాలు కవితదని తెలియగానే, వెంటనే నిద్ర ఎగిరిపోయి 'ఏమిటి విశేషం?' అని అడిగింది హుషారుగా, కుతూహలం నిండిన గొంతుకతో. కవిత అందుకు

'అదే, ఈ వేళ మీ ఇంట్లో డిన్నరు గురించి...' అని ఏదో అనబోయి ఆగి పోయింది.

'ఏమిటే అలా సందేహిస్తున్నావు. మా ఇంట్లో ఈ వేళ డిన్నరు వుంది. దానికి మీరు వస్తున్నారు' అంది శాంత ధృడంగా.

అందుకు కవిత నవ్వుతూ 'అది కాదు శాంత! నువ్వు ఏమి అనుకోక పోతే, ఈ డిన్నరు అలేఖ్య వచ్చేవరకు పోష్టుపోను చెయ్యకూడదూ? ఆ పిల్ల ఎలాగూ ఇరవై రోజులలో వస్తుంది కదా. ఆమెను చూడ్డానికి ఎలాగూ వస్తాము.' అని అంది.

దానికి కొంచెం విసుగ్గా శాంత 'అబ్బా ఆవిడగారు రావడానికి ఇంకా టైము వుంది కదే. నీ close friendగా నేను ఇప్పుడు రావే అని పిలుస్తే, తరవాత వస్తానంటావేమిటి, ఆ అమ్మాయి వచ్చేక మళ్ళా రావచ్చులే. ఈ వేళ తప్పకుండా రండి.' అని కవితను ఒప్పించి, సంభాషణ ముగించింది. రిసీవరు పెట్టేసి వచ్చి పడక కుర్చీలో వాలింది శాంత.

ఒక్కసారి కళ్ళు మూసుకొని దీర్ఘాలోచనలో పడింది. 'అలేఖ్య' ఆ పదం గిఱ్ఱున తన మెదడులో వేయిసార్లు మోగింది. ఎంత చిత్రం! అలేఖ్య వస్తుందని తెలిసినప్పటినుండి జీవితం ఎంతమారి పోయింది. ఈ రెండు మూడు నెలలలో తనకు తెలిసిన వారు అలేఖ్య గురించి అడగనివారంటూ ఎవ్వరూ లేరు. ప్రతివారు ఆ అమ్మాయి రాకకోసం ఎదురు చూసిన వాళ్ళే. ఈ మధ్య పది రోజులనుండి ఫోనుకాల్స్ కూడా చాలా ఎక్కువ అయ్యేయి. ఇదివరకు తనకు వచ్చే కాల్స్ అన్ని ఇప్పుడు అలేఖ్య కోసం వస్తున్నాయి. ఆవిడగారు ఎప్పుడు land అవుతుందో అని తెలుసుకోవడానికి మాత్రమే. బయటవాళ్ళ సంగతి అలా ఉంచితే, ఇంట్లో ఉన్న వాళ్ళ సంగతి ఇంక చెప్పనక్కరలేదు. అందరికి అడావిడి ఎక్కువ అయ్యింది. డిశంబరు రెండవతేదీ (అలేఖ్య వచ్చే రోజు) ఒక పెద్ద పర్వదినంలాగ ఇంట్లో arrangements చేయబడుతున్నాయి. భారత ప్రధాని మన ఇల్లు సందర్శిస్తారంటే జరగ తగ్గ అడావిడి కనిపిస్తుంది ఇంట్లో. ఇక అమ్మ, నాన్న ఉత్సాహం చెప్పనక్కరలేదు. అలేఖ్య వచ్చేరోజుకు నెలముందర వచ్చి వాళ్ళు పాపం రోజులు లెక్కబెడుతున్నారు.

ఇలా ఆలోచనలలోవున్న శాంత కళ్ళు ఎదురుగోడకు వేళ్ళాడుతున్న తన భర్త శశిధర్ ఫోటోమీద పడ్డాయి. శాంత భావాలు క్రిందటి దినం సాయంత్రం అయిన సంఘటన మీదకు మళ్ళాయి. ఇద్దరు ఆఫీసునుండి తిరిగి ఇంటికి కారులో వస్తున్నారు. ఉన్నట్లుండి శాంతకు ఏదో జ్ఞాపకం వచ్చి, భర్తకేసి చూసి 'ఏమండీ, మన personal computer లో passwordని మీరేదైనా మార్చారా? ఈ వేళ దానిని వాడదామనుకొంటె access దొరక లేదు.' అని అంది. దానికి శశిధర్ తనవైపు చూడకుండా 'అవును ఇదివరకు నీ date of birth passwordగా వాడేవాళ్ళము. కాని ఈ మధ్య నా మనసు మార్చుకొని దాన్ని మార్చేను' అన్నారు. 'పోని కొత్త word శలవిస్తే నేను కూడా కంప్యూటరు వాడుకోవచ్చుగా' అని తను అంది, 'తన భర్త ఎందుకు అలా చేసేడో?'అని మనస్సులో ప్రశ్నించుకొంటూ. ఆ password 'అలేఖ్య' అని శశిధర్ సమాధానం దూసుకుంటూ వచ్చింది శాంతమీదకు. చాలా ఆశ్చర్యపోయింది శాంత. శశిధర్ కు తనంటే ప్రాణం. ఎప్పుడూ సరదాగా మాట్లాడుతూ, నవ్వుతూ తనవెంతో ప్రేమగా చూసుకొనేవాడు. కాని, ఈ మధ్య అలేఖ్య రాక విషయం తెలిసినప్పటినుండి ఆయన ప్రవర్తన పూర్తిగా మారిపోయింది. ఈ మధ్య అస్తమానూ అలేఖ్యను ఎలా receive చేసుకోవాలి? అలేఖ్యకు ఎటువంటి కానుకలు కొనాలి? మొదలగు విషయాల మీదే ఆయన ఆలోచనలు, మాటలు లేకపోతే ఆమె గారి అందాన్ని ఊహించుకోవడం. లోకమంతా అలేఖ్యమయమవుతున్నట్లు అనిపించింది శాంతకు.

రోజులు గడిచేకొద్దీ శాంతకు భారం, ఆందోళన, కుతూహలం ఎక్కువయ్యేయి. ఏమిటో! మనసు నిండా అంతులేని భావాలు ముసురుకొంటున్నాయి. అప్పుడప్పుడు భవిష్యత్తు తలచుకొంటే తెలియని భయమేదో తనను ఆవహిస్తుంది.

ఒక రోజు బస్‌స్టాండ్‌లో నుంచుని బస్ రాకకై వేచి వుండగా, తన colleague రమ ఎదురై, 'Hi! శాంతా! రోజు రోజుకి నీ ముఖారవిందంలో ఆందోళన ఎక్కువవుతూంది. ఏమిటి? ఆలేఖ్య గురించేనా నీ చింతట! అని అడిగింది. 'అవునే' అని సమాధానం ఇచ్చింది శాంత నెమ్మదిగా. 'అవును అలేఖ్య exact date of arrival ఎప్పుడు?' అని మళ్ళా ప్రశ్న వేసింది రమ. అందుకు శాంత 'ఏమో, ఆమెగారికి ఫోను వుందా కనుక్కోడానికి! వస్తున్నదని మాత్రం కబురు వచ్చింది. Date of arrival December 2nd అని తెలిసింది' అని అంది చిరు మందహాసంతో.

'అవును, ఆ సుందరిని రిసీవు చేసుకోడానికి ఎంతమంది వస్తున్నారేమిటి?' అని అడిగింది మళ్ళా రమ, గొంతుకలో కుతూహలం ఉట్టిబడుతూ.

దానికి శాంత 'ఏమో, interest ఉన్న వాళ్ళందరు వస్తారనుకొంటాను.' అంది నవ్వుతూ.

'శాంతా! నేనొక మంచి gift కొన్నాను అలేఖ్య కోసం. ఈ వేళ నీకిద్దామనుకొన్నాను, రాగానే ఆ అమ్మాయికిస్తావని. కాని తేవడం మరచిపోయేను' అని sorry చెప్పింది రమ వెళ్ళుతూ.

ఇంతటిలో బస్సు వచ్చింది. బస్సులో కూర్చున్న వెంటనే శాంత మళ్ళా ఆలోచనలో పడింది. 'ఈ సుందరి తన జీవితంలో అడుగుపెట్టగానే తను ఎన్నిమార్పులు, ఎన్ని సమస్యలు ఎదుర్కోవాలో' అని అనుకొంది. అలేఖ్య తన ఇంట్లో adjust అవగలుగుతుందా? తను చూపే మమకారం సరిపోతుందా? అసలు ఇప్పుడు ఎలాగుందో? అన్న ప్రశ్నలు తన మనస్సులో ఉదయించేయి.

**December 4th:**

ఏ కారణంవలనో అలేఖ్య అనుకున్నట్లు డిశంబరు రెండవ తేదీన రాలేదు. ఆ మరునాడు కూడా ఆమె పత్తా లేదు. ప్రయాణానికి ఏమి అడ్డంకులు వచ్చేయో? లేకపోతే ఏమైనా అర్జంటు పనులున్నాయో? ఎవరికి తెలియదు. ఈ వేళ తప్పక వస్తున్నట్లు మళ్ళా కబురు వచ్చింది.

అక్కడ నుంచున్నవాళ్ళందరి ముఖాలలో కుతూహలం, ఆత్రుతవంటి భావాలు తాండవిస్తున్నాయి. శాంత తప్ప అక్కడ అందరు ఉన్నారు. 'arrivals' door వద్ద నిలబడి ఎదురు చూపులతో అలేఖ్య రాక కోసం నిరీక్షిస్తున్నారు. అందరి కన్నా శశిధర్ ముఖంలో ఆత్రుత కొట్టొచ్చినట్లు కనపడుతోంది. ఒక్క చోట నుంచోకుండా అటూ ఇటూ తిరుగుతున్నాడు.

Time ఉదయం 10:45 అయ్యింది. 'ఇక ఏక్షణమైనా అలేఖ్య భూమి మీదకు దిగవచ్చు. ఎంత అందంగా వుంటుందో? తమవైపుకు చూస్తుందో లేదో?' ఇలా అందరి ఆలోచనలు వేరువేరుగా కదలాడగా ఎదురుగా ఉన్న గుమ్మం తెల్లటి తలుపులు తెరుచుకొన్నాయి. ఓ అందమైన అమ్మాయి తెల్లటి uniformలో చిరునవ్వుతో ప్రత్యక్షమయ్యింది. శశిధర్ ఒక్కక్షణం ఊపిరి బిగపెట్టుకొని ఆమెకేసి చూసేడు. అక్కడ ఉన్నవాళ్ళందరి చూపులు కూడా ఆమెపై నిలిచేయి. కాని వాళ్ళందరి కనులు ఆమె ముఖముపై కాకుండా ఆమె చేతులలో వున్న ఓ చిన్న bundle మీద కేంద్రీకరింపబడి ఉన్నాయి. అందులోంచి చంద్ర బింబమువంటి ఓ చిన్నారి

ముఖము, తన కమల నయనములతో, అందరివైపున చూసింది. ఇంతలో ఆ అందాల భరణిని ఎత్తుకొన్న nurse పాప తండ్రికేసి చూస్తూ 'Congratulations Mr. Sasidhar! your daughter Alekhya has arrived. Here she is.' అని అందించింది ఆ బంగారు మూటను, పట్టరాని ఆనందంతో మతాబులా వెలిగిపోతున్న శశిధర్‌కు.********

(Note: Ultrasound Scanning ద్వారా ఈ మధ్య పుట్టబోయే బిడ్డ sex తెలుసుకొంటున్నారు. U.S.A.లో హాస్పిటల్ వారికి బిడ్డపుట్టకమునుపే పేరు చెప్పాల్సిన అవసరం వుంది. అందుచేత తల్లితండ్రులు సాధారణంగా ముందే బిడ్డ పేరు నిర్ణయించుకొంటారు. అదే విధంగా ఈ కథలో ' అలేఖ్య'కు తన పేరు పుట్టకముందే నిశ్చయింపబడింది.)

## ఎందుకమ్మా వసంతమా!

ప|| ఎందుకమ్మా వసంతమా
ఏమిటోయీ పరుగులూ
మూడునాళ్ళ మురిపమేలా
ముందు ముందు దిగులు ఏల....|ఎందుకమ్మా|


చ|| నీవురాక చిగురురాక
మోడుపోయె మామిడమ్మ
పుడమిపైన పూవులేక
మూగబోయె తుమ్మెదమ్మ....|ఎందుకమ్మా|

చ|| పచ్చపచ్చని చిగురుకొమ్మలు
నిన్నుచూసి మురియునోయి
కొమ్మకొమ్మకు కోయిలమ్మలు
గొంతువిప్పి పాడునోయి....|ఎందుకమ్మా|

చ|| ఎంతకాలము నీవులేక
ఎదురుచూపులు మాకు ఏల
పలకవమ్మా ప్రకృతి నీవు
పరవశింపగ రావటమ్మా....|ఎందుకమ్మా|

— నాగలక్ష్మి కొంకపాక
*Schiller Park, IL*

తెలుగు కళాసమితి, న్యూజెర్సీ కార్టూన్ల పోటీలో బహుమతి పొందినకార్టూన్!



## తానా సభలు – మరో అభిప్రాయము

ఎంతో ఉత్సాహంగా తానా సభలకు హాజరైనవారంతా గాలితీసిన బెలూన్లలా తిరిగివచ్చామంటే అతిశయోక్తి కాదనుకుంటాను. ఆడంబరాలకు, అట్టహాసాలకు ఇస్తున్న ప్రాముఖ్యత మన లక్ష్యాలకు, ఆశయాలకు, మాటల్లో అన్నది చేతల్లో చూపించే ప్రయత్నానికి ఇవ్వడంలేదని స్పష్టంగా తెలిసిపోతున్నది. ఎవరో తరుముకువస్తున్నట్లు గుడ్డిగా పరుగెడుతున్న మనం, ఇంక ఈ పరుగులు ఆపి ఒకసారి ఆత్మపరిశీలన, విమర్శన చేసుకొని నెమ్మదిగా ముందుకు సాగవలసిన అవసరం ఎంతో ఉన్నదనిపిస్తున్నది. మన భాషా, సంస్కృతి పేరట రెండేళ్ళకోసారి భారీఎత్తున ఎంతో డబ్బు ఖర్చుపెట్టి చేస్తున్న ఈ సభల వ్యవధికాలం చాలా తక్కువ. దేశం నలుమూలలనుండి ఎన్నోవేలమంది తెలుగువారిని ఒక్కచోటకు చేర్చుతున్న ఈ సభలు మంచిని, సంతోషాన్ని పంచి యివ్వకపోగా, అందరిలో నిరాశ, నిస్పృహలతోపాటు ఆవేశాన్ని, కోపతాపాల్ని, మనస్పర్థల్ని పెంచుతున్నాయి. అందుకే ఇటువంటి సభలు ఏ ఐదేళ్ళకోసారో నిర్వహిస్తే మన తప్పొప్పులను పరిశీలించుకొనే వ్యవధి, క్రమపద్ధతిగా చేయడానికి తగిన వ్యవధి, ఓర్పు, అన్నింటినిమించి లక్ష్యం పట్ల విలువ గౌరవం పెరుగుతుందేమో!

— శ్యామలదేవి దశిక
*North Brunswick, NJ*



## CONGRATULATIONS SUNITHA!

**Dr. Sunitha Polepalle**, our youth member and daughter of our active life-members and well-wishers. Mr. Sankara Rao and Mrs. Madhavi Polepalle is married to **Dr. Sashikumar Makam**, son of Mr. Makam Rammurthy and Mrs. Makam Sulochana on January 24, 1992 at Cuddapah Venkateswara Kalyana Mandapam. Reception was held in NJ on August 21. 1993 and is very well attended.

Sunitha is currently working as a resident in Columbia Presbyterian Hospital, NY specializing in Physical Medicine and Sashi is specializing in Internal Medicine at Lincoln Hospital, Bronx, NY.

TFAS congratulates the couple and wishes them al the best in future.